# నేనూ సగటు మనిషినే

## విరించి

ఆదర్శానికి ఆచరణకి ఉన్న అంతరం మొట్ట మొదటిసారి నాకు అవగతమయ్యింది. నా అంతరాత్మకి ఈ రోజుకీ నేను సమాధానం చెప్పుకోలేకపోతున్నాను. దానధర్మాల గురించి ఉదాత్తంగా, సహాయ సహకారాలు గురించి ఉన్నతంగా పలికే నేను ఓ నిండు ప్రాణాన్ని అవకాశముండీ ఆదుకోలేకపోయాను. విశ్వనాథం విషయంలో నేను సగటు మనిషిలాగే ప్రవర్తించాను. విశ్వనాధాన్ని 'విశ్వం' అని పిలుస్తాం. అతను నాకు దూరపు బంధువు. చిన్నప్పట్నుంచి తెలుసున్న వాడయినా, ఈ ఊరు నాకు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చిన ఈ రెండు సంవత్సరాలలోను మా మధ్య స్నేహం బాగా పెరిగింది. నిజానికి విశ్వం నేనూ కలవని రోజంటూ లేదు. రోజూ నేను ఆఫీస్ నుంచి రాగానే విశ్వానికి ఓ ఫోన్ కొట్టేవాణ్ణి. సాధారణంగా విశ్వం తన కూతురు అనూహ్యను తీసుకొని మా యింటికొచ్చేవాడు. విశ్వానికి అనూహ్య అంటే ప్రాణం. ఎనిమిదేళ్ళ అనూహ్య పన్నెండేళ్ల మా బాబు వినీత్‌తో ఆడుకుంటూండేది. మేమిద్దరం దగ్గర్లోని గాంధీ పార్క్‌కో, రోజా టాంక్‌కో వెళ్ళేవాళ్ళం. తరచూ దక్షిణం వైపునున్న మా బాల్కనీలో కూర్చుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం.



విశ్వం ఎన్ని వ్యాపారాలు చేసినా కలిసిరాక పోవడంతో కారు డ్రైవింగ్ స్కూలు పెట్టాడు. ఎవరికి ఏ సహాయం చేయాలన్నా వెనుకాడేవాడు కాదు. అతను నాకు చేసిన సహాయం మర్చిపోలేనిది. మా వినీత్‌కు తరచు కడుపునొప్పి వస్తూండేది. లోకల్‌గా గాస్ట్రో ఎంటరాలజిస్ట్‌కు చూపించి, టెస్ట్‌లు అన్నీ చేయించి మందులు వాడుతున్నాం. ఓ రోజు ఉదయం అకస్మాత్‌గా నొప్పి ఎక్కువయ్యింది.

''నాన్నా! ఏదన్నా చెయ్యి. బాధ భరించలేక పోతున్నా'' అని వినీత్ గోలచేస్తున్నాడు. నా భార్య రాధ గుడ్ల నీరు గ్రుక్కుతోంది. నాకు ఏం చేయ్యాలో చెయ్యి కాలు ఆడటంలేదు. డాక్టర్‌కు ఫోన్ చేస్తే 'ఏం ఫర్వాలేదు ఆ మందులే వాడండి. తగ్గి పోతుంది' అన్నారు.

సరిగ్గా అదే సమయానికి విశ్వం వచ్చాడు.

''ఏమిటి కృష్ణగారూ! వినీత్‌కు తగ్గలేదా?'' అన్నాడు.

''రాత్రి కొద్దిగా వచ్చింది. ఉదయం నుంచి మరీ ఎక్కువయ్యింది. హైదరాబాద్ వెళ్దామంటే పన్నెండు గంటలు ప్రయాణం. రైల్వే రిజర్వేషన్ దొరకలేదు'' అన్నాను.

''హైదరాబాద్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి గారి దగ్గరకే కదా!'' అన్నాడు.

''అవును ఆయనైతే కరెక్ట్‌గా డయాగ్నైజ్ చేస్తారు. ధైర్యంగా ఉండొచ్చు'' అన్నాను. వినీత్ మాకు లేకలేక పెళ్లైన పదేళ్లకు పుట్టాడు.

అప్పటికే స్థానికంగా ముగ్గురు డాక్టర్స్‌కు చూపించడం సాయినాధునికి మొక్కుకోవడం అయిపోయాయి.

''మీరేం వర్రీకాకండి. మీరు ప్రయాణానికి రెడీ అవండి మీ కారు కీస్ ఓ సారిలా ఇవ్వండి'' అన్నాడు.

కారు కీస్ ఇచ్చాను.

''నేను ఇప్పుడే ఓసారి మెకానిక్ చేత చెక్ చేయించి తీసుకొస్తా. ఓ గంటలో బయల్దేరుదాం. మీరు రెడీగా ఉండండి'' అన్నాడు. నాకు విశ్వంలో సాయిబాబా విశ్వరూప సందర్శనం అయినట్లయింది. ఆ బాబాయే ఈతన్ని చూపించాడా లేక ఆ బాబాయే వచ్చాడా అన్పించింది.

ఓ గంటలో నేను, రాధ, వినీత్ రెడీ అయ్యాం. విశ్వం రాగానే బయల్దేరాం. విశ్వం ఎక్స్‌పర్ట్ డ్రైవర్. ఐదువందల కిలోమీటర్లు అవలీలగా అతి జాగ్రత్తగా మాకే మాత్రం కుదుపు లేకుండా రాత్రి పదకొండు గంటల కల్లా హైదరాబాద్ తీసుకెళ్ళాడు.

ఆ మర్నాడు డాక్టర్‌కు వినీత్‌ను చూపించాం. 'కొలైటెస్' అని కొన్ని టెస్ట్‌లు, అబ్జర్వేషన్స్ చెయ్యాలి. హాస్పిటల్‌లో జాయిన్ అవమన్నారు. ఓ వారం పదిరోజులు ఉండాలి. ఎక్కడ ఉండాలి? వెంటనే శాస్త్రిగారు గుర్తుకొచ్చారు. శాస్త్రిగారు, మేం హైదరాబాద్‌లో ఉన్నప్పుడు వాళ్ళింట్లోనే ఉన్నాం. వారికి ఫోన్ చెయ్యగానే హుటాహుటిన వచ్చి మమ్మల్ని తీసుకెళ్ళారు.

మర్నాడు వినీత్‌ను హాస్పిటల్‌లో అడ్మిట్ చేసాం. మాతోబాటే విశ్వం కూడా ఉండిపోయాడు.

''విశ్వం! నువ్వు మా కోసం బాగా శ్రమపడ్డావ్. అనూహ్య నీ కోసం బెంగపెట్టుకుంటుంది. నువ్వు వెళ్లిపో'' అన్నాను.

''భలేవారే! మీరు ఫంక్షన్‌లో ఉంటే వదిలేస్తా, టెంక్షన్‌లో ఉంటే వదిలి ఎట్లా పోతా? అనూహ్యతో రోజూ మాట్లాడుతున్నా. మీరేం వర్రీకాకండి'' అన్నాడు విశ్వం నవ్వుతూ.

నిజానికి అనూహ్య కంటే విశ్వానికే ఎక్కువ బెంగ, అయినా, మా వినీత్ కోసం తన కూతుర్ని కూడా వదలి వచ్చాడు. ఒకోసారి రాత్రి హాస్పిటల్ గేటు మూసేస్తే చలిలో కారులోనే పడుకునేవాడు. ఎన్నిసార్లు చెప్పినా వెళ్ళిపోడానికి విశ్వం అంగీకరించలేదు.

ఎకాఎకీనా పన్నెండు రోజులు హాస్పిటల్‌లో ఉన్నారు. ఈ పన్నెండు రోజులూ మా కోసం ఎంతో శ్రమ పడ్డాడు విశ్వం. అతను చేసిన సహాయం మరువలేనిది. పద్నాల్గు రోజులు తర్వాత క్షేమంగా ఇంటికి తీసుకొచ్చాడు విశ్వం.

మళ్ళీ రొటీన్ పనిలో పడిపోయాం. వినీత్ ఆరోగ్యంగా బాగానే ఉన్నాడు. రోజూ స్కూలుకు వెళ్తున్నాడు. విశ్వం డ్రైవింగ్ క్లాసెస్ బాగా పెరిగాయి. ఎడెనిమిది క్లాలసులిచ్చి రోజుకు వెయ్యిరూపాయలు సంపాదిస్తున్నాడు. నాకు చాలా సంతోషంగా ఉంది. అతను ఆ విధంగా సెటిల్ అయినందుకు.

ఓ రెండు రోజులు విశ్వం కనపడలేదు. నేనూ ఆఫీస్ క్యాంపులో ఉండి ఫోన్ చెయ్యడానికి కుదరలేదు. మూడో రోజున ఫోన్ చేస్తే విశ్వానికి వంట్లో బాగాలేదని అతని భార్య రాణి చెప్పింది. నేను వెంటనే బయల్దేరి వెళ్ళాను. అతను మంచం మీద పడుకుని ఉన్నాడు.

''ఏమిటి విశ్వం? ఏమయ్యింది? నా కెందుకు ఫోన్ చెయ్యలేదు?'' అన్నాను ఆతృతగా.

''కంగారు పడాల్సిందేం లేదండి. తెల్లవారు ఝూమున ఛాతిలో అసౌకర్యంగా ఉంటే నిద్ర పట్టలేదు. డాక్టర్ దగ్గరకెళ్తే కార్డియాలజిస్ట్‌ని చూడమన్నాడు. డాక్టర్ రంగస్వామిగారు హార్ట్ వాల్వ్ తెబ్బతిందని రీప్లేస్ చెయ్యాలని అన్నారు'' అన్నాడు విశ్వం చిన్నగా నవ్వుతూ అదేదో చిన్న విషయం అన్నట్లు.

''నిజమా? ఎన్నాళ్ళ నుంచి ఉంది ఈ ప్రాబ్లమ్?'' అన్నాను బాధగా.

''పది సంవత్సరాల క్రితం మొట్టమొదటిసారి నోటీస్ చేసారు. ప్రతీ ఇరవైరోజులకీ ఇంజక్షన్ చేయించుకోవాలి. కొంతకాలం చేయించుకుని మానేశా. దాని పర్యవసానమే ఇది'' అన్నాడు.

''ఏమిటి విశ్వం? చదువుకున్నవాడివి. అదేం పని? సరే, వాల్వ్ రిప్లేస్ చేయిద్దాం''అన్నాను.

# కథ

అతను చిన్నగా నవ్వాడు.

''అదంత చిన్న వ్యవహారం కాదు సార్! లక్షయాభైవేలు పైనే అవుతుంది. అంత డబ్బు నా దగ్గర లేదు. పుట్టపర్తి రాసాను. అక్కడైతే ఫ్రీగా చేస్తారట'' అన్నాడు.

''లేటవుతుందేమో. అర్జన్సీ ఏమీ లేదా? డాక్టర్ ఏమన్నారు?''

''ఫర్వాలేదు సార్! మందులు వాడాక బాగానే ఉంది. సాధ్యమయినంత త్వరగా ఆపరేషన్ చేయించుకోమన్నారు'' అన్నాడు విశ్వం.

విశ్వంలో ఎందుకో మునపటి ఉత్సాహం లేదు. అనూహ్య వచ్చి వళ్ళో కూర్చుంది. విశ్వం దగ్గ రకు లాక్కుని ముద్దు పెట్టుకున్నాడు. భార్య మొహంకేసి చూసాను. ఆమె కన్నీరు ఆపుకుంటూంది. విశ్వానికి ధైర్యం చెప్పి ఇంటికొచ్చాను. మనస్సుకు చాలా బాధగా ఉంది. విశ్వం నా కంటే పదేళ్ళు చిన్నవాడు. హార్ట్ ఆపరేషన్ అంటే లక్షలతో కూడుకున్న వ్యవహారం. వాల్వ్ దెబ్బతిని కూడా రాను పోను వెయ్యికిలో మీటర్లు డ్రయివ్ చేసాడంటే, పద్నాలుగు రోజులు భార్యాబిడ్డల్ని వదిలి మాతో ఉన్నాడంటే, ఏమిచ్చి రుణం తీర్చుకోను?

విశ్వం మళ్లీ కారు డ్రైవింగ్ క్లాసులిస్తు న్నాడు. మళ్ళీ బిజీ అయ్యాడు. మంచి పేరొచ్చింది. నేర్చుకోడానికి రెండు మూడు నెలలు తర్వాత డేట్స్ ఇస్తున్నాడు.

ఓ రోజు ఉదయం విశ్వం ఫోన్ చేసాడు.

''కృష్ణగారూ పుట్టపర్తిలో పది సంవత్సరాల ప్రయారిటీ ఉందట. ప్రస్తుతం అవకాశం లేదు. లోకల్‌గా ఎక్కడైనా ఆపరేషన్ చేయించుకోమని లెటర్ వచ్చింది. ఈ రోజు బెగళూర్ వైట్‌ఫీల్డ్ వెళ్తున్నాను సార్'' అన్నాడు. అతని స్వరం ఆశానిరాశల మధ్య దోబూచులాడుతోంది.

''డోన్ట్ గెట్ డిసప్పాయింటెడ్, క్షేమంగా వెళ్ళిరా. ఆల్ ద బెస్ట్'' అన్నాను.

నాల్గురోజుల తర్వాత బెంగళూరు నుంచి తిరిగొచ్చాడు. వైట్‌ఫీల్డ్‌లో కూడా వెయిటింగ్ లిస్ట్ చాలా ఉందట. ఈసారి అతని మొహంలో నిరాశ స్పష్టంగా కన్పించింది.

''కృష్ణగారూ! నాకో సహాయం చెయ్యాలి'' అన్నాడు.

''చెప్పు విశ్వం!''

''ఏం లేదు, నాకు వైట్ రేషన్ కార్డు ఇప్పించండి. ఆరోగ్యశ్రీ కార్డ్ అయితే ఫ్రీగా చేస్తారట'' అన్నాడు.

''సరే! తప్పకుండా ఇప్పిస్తాను. కానీ,

గవర్నమెంటులో రెడ్‌టేపిజమ్, కరప్షన్ నీకు తెలుసుగా. త్వరగా పనులు అవవు, లేటయితే నీకు సమస్య కదా!'' అన్నాను.

''ఫర్వాలేదు సార్! ఇంతకాలం ఆగిన వాడిని మరి కొంతకాలం ఆగుతాను'' అన్నాడు.

''సరే'' అన్నాను.

ఆ రోజు నుంచి ఆరోగ్యశ్రీ కార్డు గురించి రోజు తిరుగుతూనే ఉన్నాను. నెల, రెండు, మూడు నెలలు అయ్యింది. ప్రాణాల విలువ తెలియని అధికారులు రేపు మాపు అని తిప్పుతూనే ఉన్నారు.

''విశ్వం! ఓ పని చేద్దాం. నేను కొంత డబ్బిస్తాను. నువ్వు హైద్రాబాద్ వెళ్ళి టెస్ట్స్ చేయించుకో. వాళ్ళు డేట్ ఫిక్స్ చేసేలోపుల్లో ఆరోగ్యశ్రీ కార్డ్ వస్తుంది. రాకపోయినా మీ ముగ్గురు బావలు, నేను డబ్బు విషయం చూస్తాం'' అన్నాను.

''ఇతరులు దగ్గర చెయ్యిచాచేటట్లయితే నాకు ఆపరేషన్ వద్దు సార్! మీరు కూడా నాకు అప్పుగా ఇవ్వండి. నేను ఓ ముఫైవేలు దాచుకున్నాను. ఆరోగ్యశ్రీ కార్డు వచ్చాకే చేయించుకుంటాను'' అన్నాడు విశ్వం. అతనికి మొహమాటం, ఆత్మాభిమానం ఎక్కువ. అతనికి వాళ్ళవాళ్ళెవరితోనూ సత్‌సంబంధాలున్నట్లు లేదు.

ఈ మధ్య విశ్వం రోజూ కనపడటం లేదు. క్లాసులు ఎక్కువగా ఉన్నాయని, కొత్త వాళ్ళు డ్రైవింగులో చేరుతున్నారని చెప్తున్నాడు. అతను బిజీగా ఉంటున్నాడని నేను కూడా రోజూ ఫోన్ చెయ్యడం తగ్గించాను. ఈసారి వారం రోజులు దాకా కనపడలేదు.

ఓ రోజు ఉదయం ఫోన్ చేసాడు.

''గుడ్ మార్నింగ్ కృష్ణగారు'' అన్నాడు. అతని స్వరం ఎక్కడో నూతిలోంచి వచ్చినట్లుంది.

''ఏమిటి విశ్వం? ఎలా ఉంది?'' అన్నాను.

''కాళ్లు వాచాయి. దగ్గు, ఆయాసం ఎక్కువగా ఉంది. ఈరోజు డాక్టర్ దగ్గరకు వెళ్ళాలి'' అన్నాడు. మాట చాలా నీరసంగా ఉంది.

''ఇప్పుడే వస్తున్నాను'' అని వెంటనే బయల్దేరి వెళ్ళా. నేను వెళ్ళేటప్పటికి బెడ్‌రూంలో పడుకుని ఉన్నాడు. పక్కన భార్య రాణి, అనూహ్య కూర్చుని ఉన్నారు. టేబుల్ పై మందులు కుప్పలుగా ఉన్నాయి.

అతని పరిస్థితి చూస్తే ఎందుకో నాకు భయం వేసింది. వెంటనే నా కారులో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లా. డాక్టర్ రంగస్వామి మంచి పేరున్న డాక్టర్. విశ్వాన్ని చూసిన తర్వాత అతన్ని బయట కూర్చోబెట్టి డాక్టర్‌ను విడిగా కలిసా. ఆయన చెప్పిదాన్ని బట్టి విశ్వం పరిస్థితి ప్రమాదకరంగా ఉందని అర్థమయ్యింది.

వెంటనే రైలు రిజర్వేషన్ చేయించాను. ఆ మర్నాడు రాత్రి నా కారులో తీసుకెళ్ళి ట్రయిన్ ఎక్కించాను. ఆరోగ్యశ్రీ కార్డు కూడా ఆ సాయంత్రమే వచ్చింది. ఆ కార్డు, వెయ్యిరూపాయల నోట్లు ఓ పది అతని చేతిలో పెట్టాను. కృతజ్ఞతాపూర్వకంగా అతను చూసిన చూపు నన్ను కలచి వేసింది.

''విశ్వం! హేపీగా వెళ్ళిరా. అన్నీ శుభాశకునాలే. ఆరోగ్యశ్రీ కార్డు కూడా సరిగ్గా టైంకు వచ్చింది. అక్కడికి వెళ్ళగానే నీకు రిలీఫ్‌గా ఉంటుంది. వెళ్ళగానే ఫోన్ చెయ్యి. ఆల్ ద బెస్ట్. హేపీ జర్నీ'' అన్నాను.

మనస్సులో బాధగానే ఉంది. కేవలం భార్య, బిడ్డతో ఒంటరిగా గుండె ఆపరేషన్‌కు వెళ్తున్నాడే, ఎవ్వరం కూడ వెంట వెళ్ళడం లేదే అని ఆమాటే అన్నాను.

''మా బావమరిది స్టేషన్‌కు వస్తాడు. మీరేం వర్రీకావద్దు'' అన్నాడు విశ్వం.

బండి కదలగానే అనూహ్య టాటా చెప్పింది. పాలబుగ్గల అనూహ్యకు ఏమీ తెలియదు కదా!

అదే విశ్వాన్ని ఆఖరిసారి చూడ్డం. వెళ్ళిన మర్నాడు విశ్వానికి ఫోన్ చేసాను.


''హైద్రాబాద్ వచ్చాక చాలా రిలీఫ్‌గా ఉందండి. రెండు మూడు రోజుల్లో ఆపరేషన్ చేస్తార్ట. ఓ పదిహేనురోజుల్లో వచ్చేస్తాను'' అన్నాడు విశ్వం. అతని కంఠంలో ఎంతో ధైర్యం, నమ్మకం కన్పించాయి. నాకు ఎంతో సంతోషం అన్పించింది. సాయిబాబాకి అతను క్షేమంగా తిరిగి రావాలని ఎన్నో మొక్కులు మొక్కాను.

నాల్గురోజుల తర్వాత తెల్లవారు ఝామున ఫోన్ వచ్చింది. వాళ్ళ బావమరిది రామ్మూర్తి మాట్లాడాడు.

''కృష్ణగారు హి ఈజ్ నో మోర్ సర్! ఆపరేషన్ కూడా చెయ్యకుండానే మనల్ని వదిలి వెళ్ళిపోయాడు. మేం బాడీని తీసుకొచ్చేస్తున్నాం'' అన్నాడు.

నాకు పెద్ద షాక్. ఇది అబద్ధం అయ్యేటట్లు చూడమని భగవంతుని ప్రార్థించాను. నాలో నీరసం, నిస్సత్తువ ఆవరించాయి. ఒక్కసారిగా సోఫాలో కూలబడ్డాను. చాలాసేపటివరకు తేరుకోలేకపోయాను.

వెంటనే నేను, రాధ, వినీత్, అమ్మ అందరం



## పెంగ్విన్ పెయింటింగ్స్

అమెరికాలోని కొలంబియా నగరంలో ఒక వేలం పాట జరగబోతోంది. ఇక్కడ అమ్మకానికి పెడుతున్నవి పెయింటింగ్స్. 'పెయింటింగ్స్ వేలం వేయడం మామూలు విషయమే కదా, ఇందులో విశేషమేముంది' అంటారా! విషయం ఉంది. ఇక్కడ వేలం పాడే చిత్ర కళాఖండాలు చేతులతో చిత్రించినవి కాదు. పంజాలతో, రెక్కలతో, కోరలతో చిత్రించినవి. అవును, ఇక్కడ పెంగ్విన్ పక్షులు తమ రెక్కలతో, హిమ ప్రాంతపు చిరుత పులులు తమ పంజాలతో, సీల్ చేపలు తమ ముట్టెలతో అలికిన రంగుల బొమ్మలు అమ్మకానికి పెడుతున్నారు. ఈ చిత్రాలను కొలంబియన్ రివర్‌బాంక్స్ జూలోని జంతువులు చిత్రించాయి. ఈ వేలం పాట నిర్వాహకుడు స్టీవ్ ఫీల్డ్‌మన్ మాట్లాడుతూ, ''జంతువుల్లో మానసికమైన చురుకుదనాన్ని కలిగించేందుకు చాలా మంది జూ అధికారులు వాటిచేత పెయింటింగ్స్ వేయించడం మామూలు విషయమే. అయితే ఇప్పటి వరకూ ఏనుగులు, ఎలుగుబంట్లు, చింపాంజీలాంటి జంతువుల చేతనే ఇలాంటి చిత్రాలు వేయించేవారు. పెంగ్విన్లచేత, సీల్ చేపల చేతా వేయించడం మాత్రం ఇదే ప్రథమం,'' అని వివరించాడు. ఇప్పటికే ఈ వేలం పాట పట్ల అమెరికాలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది.

కలిసి వాళ్ళింటికెళ్ళాం. అప్పటికే వాళ్ళింటినిండా బంధువులు, స్నేహితులు చాలామంది ఉన్నారు. అతని ముసలి తల్లితండ్రుల్ని ఓదార్చడం ఎవరివల్ల కావట్లేదు. ఒక్కగా నొక్క కొడుకు చిన్న వయస్సులోనే దూరం కావడాన్ని తట్టుకోలేక పోతున్నారు. అక్కలు, బావలు, వాళ్ళ పిల్లలు అందరూ వచ్చారు. ఎక్కడెక్కడ నుంచో జనం ఆటోలు, కార్లలో దిగుతున్నారు.

''అయ్యో! మాకు తెలియదే. మేమయినా ఆపరేషన్ చెయ్యించేవాళ్ళమే'' అంటున్నారు.

పది సంవత్సరాలు నుంచి ఉన్న 'హార్ట్‌వాల్వు' సమస్య ఇంతమంది ఆత్మీయులకు తెలియదా? అతను వైట్‌ఫీల్డ్, వైట్ కార్డుకు తిరుగుతున్నది ఆపరేషన్‌కు డబ్బు లేక కాదా! ఈ వేళ ప్రేమలు, అభిమానాలు ఒలకపోసే, కన్నీరు మున్నీరుగా విలపించే ఈ ఆత్మీయులంతా అప్పుడేమయి పోయారు? అంతా తలోచెయ్యివేసి సకాలంలో ఆపరేషన్ చేయిస్తే ఓ నిండుప్రాణం దక్కేదే! విశ్వం పార్థివ శరీరం దగ్గర కల్లబొల్లి ఏడుపులు ఏడుస్తున్న వాళ్ళని చూస్తే అసహ్యం వేసింది.

ఆ కార్యక్రమాలు అయ్యి, అంతిమ వీడ్కోలు చెప్పేటప్పటికి సాయంత్రం నాల్గు అయ్యింది. ఉదయం నుంచి మానసికంగా, శారీరకంగా నలిగిపోయానేమో నాలో నిస్సత్తువ ఆవరించింది. ఇంటికొచ్చి సోఫాలో కూలబడ్డా.

వినీత్ నాకు దగ్గరగా వచ్చాడు. వాడికి విశ్వం అంటే ఎంతో అభిమానం.

''నాన్నా!'' పిలిచాడు. తలెత్తిచూసా.

''నాన్నా మన దగ్గర డబ్బులేదా?'' అన్నాడు.

''డబ్బు దేనికి?'' అన్నాను.

''మన దగ్గర లక్షరూపాయలు లేవా?''

''ఉన్నాయి ఉంటే?'' అన్నాను చిరాగ్గా.

''లక్ష రూపాయలు ఎక్కువా? విశ్వం అంకుల్ ఎక్కువ?''

''అదేం ప్రశ్న?''

''నీ దగ్గరున్న లక్ష ఇస్తే అంకుల్ బ్రతికేవారు కదా!'' అన్నాడు. వాడి చిన్న హృదయం ఈ విషాదాన్ని తట్టుకోలేకపోతోంది. వాడ్ని దగ్గరకు తీసుకున్నాను.

''ఉన్నాయిగానీ...లక్ష రెడీగా లేవు నాన్నా'' అన్నాను.

''నువ్వు, వాళ్ళు వీళ్ళు సహాయం చేయలేదు. చేస్తే అంకుల్ బతికేవారు అని అమ్మతో అంటున్నావు కదా నాన్న! ఆ సహాయం నీ దగ్గర డబ్బుండి ఎందుకు చేయలేదు?'' వాడి ప్రశ్న గుండెల్లో గుచ్చుకుంది.

''అంత డబ్బు...మనం ఒక్కళ్ళం సర్దడం కష్టం కదా నాన్న'' అన్నాను.

''మనకు కారు అంత అవసరమా నాన్నా? కారు అమ్మేసి లక్ష ఇచ్చుంటే అంకుల్ బతికేవారు కదా!'' వాడు సంధించే ప్రశ్నలు బాణాల్లా నా గుండెల్లో గుచ్చుకుంటున్నాయి.

''అనూహ్య చూడు నాన్న! ఎంతలా ఏడుస్తోందో? అనూహ్యను స్కూలుకు ఎవరు తీసుకెళ్తారు? చాక్లెట్లు ఎవరు కొనిస్తారు నాన్న?'' వాడి ప్రశ్నలకు నా దగ్గర జవాబులు లేవు. సిగ్గుతో, బాధతో తల వంచుకున్నాను.

అవును, లక్షరూపాయలు బ్యాంక్‌లో ఉండి కూడా, అవకాశం ఉండి ఓ నిండుప్రాణాన్ని, ప్రాణస్నేహితుడ్ని, నాకెంతో సహాయం చేసినవాడ్ని రక్షించుకోలేకపోయాను కదా! ఆదర్శమయిన కబుర్లకు, ఆచరణకు ఆమడ దూరమని నాకు స్వానుభవమయ్యింది. సైకిల్ ట్యూబ్‌కు నాల్గు కన్నాలు పడితే ఒక్క కన్నానికి ప్యాచ్ వేస్తే సైకిల్ నడుస్తుందా?

నాల్గు రోజులుగా అన్నం తినని వాడికి ఒక్క ముద్ద అన్నంతో కడుపు నిండుతుందా? ఆత్మాభిమానం కల విశ్వం డబ్బులేక ఆపరేషన్ వాయిదా వేస్తూంటే, కళ్ళెదుటే ఓ నిండుప్రాణం. మృత్యువును సమీపిస్తూంటే ఓ పదివేలిచ్చి చేతులు దులుపుకున్నా. నలుగురూ సహాయం చేయలేదూ అంటే.. ఆ నలుగురిలో నేనూ ఒకడ్నే కదా! నేనూ సగటు మనిషినే.

★

కొత్త సీరియల్

మిథ్యలను ఛేదించి సత్యాలను ఆవిష్కరించే

వెలిసిపోయిన దాంపత్యాలు

రచన : కె. రామలక్ష్మి ఆరుద్ర

వచ్చేవారమే ప్రారంభం!